సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

మంగళవారం । 7 । మార్చి । 2023



అబ్బురపరిచిన స్కేటింగ్

వివిధ రికార్డుల సాధన కోసం తిరుపతికి చెందిన వేద నరసింహ అనే చిన్నారి ప్రారంభించిన స్కేటింగ్ జిల్లాలోని పలు ప్రాంతాల మీదుగా సాగింది. 8లో ▸



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.57,870
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.5,169
3 శాతం జీఎస్టీతో	రూ.5,325
సవర (8 గ్రా)	రూ.42,600

గరిష్ఠం/కనిష్ఠం
34.5 /23.5

వాతావరణం

సోమవారం గాలిలో 49 శాతం తేమ ఉంది. జిల్లాలో ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. మంగళవారం వాతావరణంలో ఎలాంటి మార్పు ఉండదు.

న్యూస్‌రీల్

కలెక్టర్‌కు ఆహ్వానం



కలెక్టర్‌ను సన్మానిస్తున్న మహిళా ఉద్యోగులు తదితరులు

నెల్లూరు(అర్బన్‌): అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 8వ తేదీన నెల్లూరు దర్గామిట్టలోని ఎన్జీఓ హోమ్‌లో మహిళా ఉద్యోగులకు నిర్వహించే క్రీడా పోటీలను ప్రారంభించేందుకు కలెక్టర్‌ కేవీఎన్‌ చక్రధర్‌బాబును ఏపీ ఎన్జీఓ మహిళా నాయకులు ఆహ్వానించారు. సోమవారం వారు కలెక్టరేట్‌లో చక్రధర్‌బాబును కలిసి ఆహ్వానపత్రాన్ని అందజేశారు. ఆయన్ను సన్మానించారు. స్పందించిన కలెక్టర్‌ తప్పకుండా వస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎన్జీఓ అసోసియేషన్‌ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పెంచలరావు, వెంకటస్వామి, రాష్ట్ర మహిళా విభాగం వైస్‌ చైర్‌పర్సన్‌ స్వర్ణలత, జిల్లా చైర్‌పర్సన్‌ చిన్నమ్మ, జిల్లా ఉపాధ్యక్షురాలు కరుణమ్మ, మహిళా కన్వీనర్‌ శారద తదితరులు పాల్గొన్నారు.

వృత్తి విద్యా కోర్సుల్లో శిక్షణ

నెల్లూరు(టౌన్‌): స్కిల్‌ హబ్‌ ఇనిషియేటివ్‌ పథకంలో భాగంగా నెల్లూరులోని వెంకటేశ్వరపురంలో ఉన్న ప్రభుత్వ బాలుర ఐటీఐలో అసోసియేట్‌ ఎలక్ట్రీషియన్‌ (45 రోజులు), అసోసియేట్‌ డేటా ఎంట్రీ ఆపరేటర్‌ (45 రోజులు) కోర్సుల్లో శిక్షణ ఇస్తామని ఐటీఐ ప్రిన్సిపల్‌ శ్రీధర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణ పొందిన వారికి నెల్లూరు నగరంలోనే ఉపాధి అవకాశాలు, స్వయం ఉపాధికి బ్యాంకుల ద్వారా రుణ సదుపాయాన్ని కల్పిస్తున్నారు. శిక్షణ పొందేందుకు పదో తరగతి ఉత్తీర్ణులైన వారు అర్హులన్నారు. ఆసక్తి గల వారు 94944 56326, 94934 12797 ఫోన్‌ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

'పది'లో అత్యుత్తమ ఫలితాలే లక్ష్యం

- డీఈఓ గంగాభవాని
- సంగం జెడ్పీ హైస్కూల్లో తనిఖీలు



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ

సంగం: పదో తరగతి పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలే లక్ష్యంగా పనిచేస్తున్నామని జిల్లా విద్యాశాఖాధికారి గంగాభవాని తెలిపారు. సంగం జెడ్పీ హైస్కూల్‌ను సోమవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. పదో తరగతి విద్యార్థులతో మాట్లాడి వసతులు, విద్యాబోధన తదితర వాటి గురించి ఆరాతీశారు. పబ్లిక్‌ పరీక్షలపై వారికి సూచనలిచ్చారు. ఉత్తీర్ణత శాతం పెంచేందుకు కృషి చేయాలని టీచర్లను ఆదేశించారు. అనంతరం రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ ఈనెల 9వ తేదీ నుంచి టెస్ట్‌ విద్యార్థులకు ప్రీ ఫైనల్‌ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వాటి ఫలితాల ఆధారంగా విద్యార్థుల సామర్థ్యాలను అంచనా వేసి, అవసరమైన వారికి శిక్షణ ఇస్తామన్నారు. ఏప్రిల్‌ 3వ తేదీ నుంచి పబ్లిక్‌ పరీక్షలు ప్రారంభమవుతాయని, జిల్లా వ్యాప్తంగా 31,600 మంది విద్యార్థులు రాయనున్నట్లు తెలిపా రు. కార్యక్రమంలో ఎంఈఓ జానకిరాం, ప్రధానోపాధ్యాయుడు మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

మహిళలు హక్కులు తెలుసుకోవాలి

- సీనియర్‌ సివిల్‌ జడ్జి శ్రీనివాసులునాయక్‌



మాట్లాడుతున్న శ్రీనివాసులు నాయక్‌

ముత్తుకూరు: భారత రాజ్యాంగంలో మహిళలకు ప్రత్యేక హక్కులు ఉన్నాయని, వాటి గురించి తెలుసుకుని ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్‌ సివిల్‌ జడ్జి ఎం.శ్రీనివాసులు నాయక్‌ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశ ప్రగతిలో పురుషులతోపాటు మహిళలు కూడా సమానంగా సహాయ పడుతున్నారని కొనియాడారు. మహిళల బలపడేందుకు సురక్షితమైన వాతావరణం కల్పించాలన్నారు. బాల్య వివాహాలు, వరకట్న వేధింపులు తదితర సమస్యలు తెలియవస్తే వెంటనే జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్‌ మనోహర్‌బాబు, సూపరింటెండెంట్‌ లక్ష్మణ్‌, పేరా లీగల్‌ వలంటీర్‌ పెసల వేణుగోపాల్‌ పాల్గొన్నారు.

ఫ్లెమ్‌.. పట్టిపీడిస్తోంది



పెద్దాస్పత్రిలోని పల్మనాలజీ వార్డు

శ్వాస తీసుకుంటేనే మనిషి ప్రాణాలతో ఉంటాడు. దీనికి ఊపిరితిత్తులు ఎంతో కీలకం. కోవిడ్‌ మహమ్మారి కారణంగా మూడు సంవత్సరాల నుంచి అందరి ఆరోగ్య పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. ప్రజారోగ్యంపై ఆ వైరస్‌ మిగిల్చిన గాయాలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. కోవిడ్‌ నుంచి కోలుకున్నా ఊపిరితిత్తుల సమస్యలు అనేకమందిని వెంటాడుతూనే ఉన్నాయి. ప్రధానంగా ఫ్లెమ్‌ పట్టిపీడిస్తోంది. ఇంకా కాలుష్యం సమస్య సరేసరి.. దీంతో ఆస్పత్రుల్లో చేరుతున్న బాధితుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది.

నెల్లూరు నగరానికి చెందిన జగదీష్‌ (పేరు మార్చాం) జర్మనీలో సాఫ్ట్‌వేర్‌ ఇంజినీరుగా పనిచేస్తున్నాడు. ఇటీవల స్వదేశానికి వచ్చాడు. వచ్చే ముందు ఆ దేశంలో అన్ని రకాల వైద్యపరీక్షలు చేయించుకున్నాడు. అంతా బాగుంది. స్వగ్రామానికి వచ్చిన కొద్దిరోజులకే శ్వాస సంబంధ సమస్యలతో నెల్లూరులోని ఓ పల్మనాలజిస్ట్‌ను కలిసి వైద్య పరీక్షలు చేయించుకుంటే అతని ఊపిరితిత్తులు ఇన్‌ఫెక్షన్‌కు గురైనట్లు రిపోర్ట్‌ వచ్చింది. వెంటనే వైద్యుని వద్ద మందులు తీసుకుని వాడుతున్నాడు.

- ఊపిరితిత్తుల సమస్యలతో అనేకమంది సతమతం
- ఆస్పత్రుల్లో పెరుగుతున్న కేసులు
- పోస్ట్‌ కోవిడ్‌ ప్రభావమూ ఉందంటున్న వైద్యులు
- సకాలంలో చికిత్సతోనే ఉపశమనం

సాక్షి, నెల్లూరు డెస్క్‌: పోస్ట్‌ కోవిడ్‌ ఎఫెక్ట్‌ ప్రజలను భయపెడుతూనే ఉంది. 2019లో మొదలైన కరోనా మహమ్మారి తెలుగు రాష్ట్రాలలో అనేకమందిని బలి తీసుకుంది. ఎంతోమందిని అచేతనావస్థలో పడేసింది. రెండేళ్లపాటు అల్లాడించింది. వైరస్‌ ముప్పు తప్పిందని భావిస్తున్న ప్రజలను మళ్లీ రకరకాల సమస్యలు వేధిస్తున్నాయి. కరోనా పూర్తిగా పోలేదని దానితో ఇంకా సహజీవనం చేస్తూనే ఉన్నారని తాజాగా వైద్యులు పేర్కొంటున్నారు. దీనికితోడు కాలుష్యం మానవాళికి పెనుముప్పుగా పరిణమిస్తోంది. గుండె, ఊపిరితిత్తుల సమస్యలతో ఆస్పత్రులకు వస్తున్న వివిధ కేసులను పరిశీలిస్తే ఈ విషయాలు తేటతెల్లమవుతున్నాయి.

ఇన్‌ఫెక్షన్‌ ఎలా సోకుతుందంటే..

ప్రధానంగా ఊపిరితిత్తుల ఇన్‌ఫెక్షన్‌కు మూడు ముఖ్యకారణాలున్నాయని వైద్యులు చెబుతున్నారు. వైరస్‌, బ్యాక్టీరియా, ఫంగస్‌ల ద్వారా ఏ మనిషికైనా ఊపిరితిత్తులు ఇన్‌ఫెక్షన్‌కు గురవుతుంటాయి. చిన్నపిల్లల నుంచి పెద్దవారి వరకు ఏ వయసుల వారికైనా ఇవి వ్యాపించవచ్చు. వాటిపై సరైన అవగాహనతో జాగ్రత్తలు పాటిస్తే రక్షణ పొందవచ్చని అంటున్నారు.

వైరస్‌ వల్ల..

నెలల వయసున్న చిన్నపిల్లల నుంచి పెద్ద వయసు వారికి కూడా వైరస్‌ సోకడంతో ఊపిరితిత్తులు ఇన్‌ఫెక్షన్‌కు గురవుతాయి. పెద్ద శ్వాసనాళాలు మ్యూకస్‌ కారణంగా మూసుకుపోయి శ్వాస తీసుకోవడానికి ఇబ్బంది ఏర్పడుతుంది. దీన్ని వైద్య పరిభాషలో బ్రాంకైటిస్‌ అని కూడా అంటారు. తుమ్మినా, దగ్గినా వైరస్‌ ఒకరి నుంచి మరొకరికి వ్యాపిస్తుంది. ఈ వ్యాధి సోకిన వారు మాస్క్‌ ధరించి ఉంటే కొంతవరకు ఇతరులకు సోకకుండా ఉంటుంది. వ్యాధిగ్రస్తులు రాత్రిపూట సరిగా నిద్రకూడా పోలేరు. రాత్రిళ్లు శ్వాసనాళాలు పూర్తిగా బ్లాంకై ఇబ్బందిపడే పరిస్థితి కూడా ఉంటుంది.

బ్యాక్టీరియాతో..

ఊపిరితిత్తుల ఇన్‌ఫెక్షన్‌కు కొన్నిసార్లు బ్యాక్టీరియా కూడా కారణమవుతుంది. మనిషికి మంచి చేసే బ్యాక్టీరియాతోపాటు చెడు బ్యాక్టీరియా కూడా ఉంటుంది. ఇది సోకినప్పుడు చిన్నపాటి శ్వాసనాళాలలో కఫం చేరి మూసుకుపోతాయి. దీనిని వైద్యపరిభాషలో నిమోనియా అని కూడా అంటారు. ఇది కూడా తుమ్ము, దగ్గు ద్వారా ఇతరులకు వ్యాపిస్తుంది. ఈ వ్యాధికి గురైన వారు ఏ చిన్నపాటి పనిచేసినా ఆయాసపడిపోతారు. గుండె బరువెక్కినట్లుగా ఉంటుంది. తరచూ దగ్గు వస్తుంది. ఒక్కోసారి శ్వాస తీసుకోవడం కష్టంగా మారుతుంది. వెంటనే వైద్యుని సంప్రదించి చికిత్స తీసుకుంటే ఉపశమనం పొందవచ్చు.




జీజీహెచ్‌లో ఊపిరితిత్తులకు సంబంధించిన సమస్యలతో చికిత్స పొందుతున్న రోగులు

ఫంగస్‌

పాడైపోయిన ఆహారం, నిల్వ ఉన్న పదార్థాలు, బూజుపట్టినవి తీసుకున్నప్పుడు ఇన్‌ఫెక్షన్‌ సోకుతుంది. జ్వరం, తలనొప్పితో లక్షణాలు ప్రారంభమై తర్వాత ఊపిరితిత్తులపై ప్రభావం చూపుతుంది. విపరీతంగా దగ్గు వస్తుంది. ఒక్కోసారి దగ్గుతోపాటు రక్తం కూడా పడవచ్చు. ఆకలి మందగిస్తుంది. ఆహారంగా ఏమి తీసుకున్నా వెంటనే వాంతి చేసుకునే పరిస్థితి ఏర్పడుతుంది. సకాలంలో వైద్యుని సంప్రదించి చికిత్స తీసుకోకపోతే ప్రాణాంతకంగా కూడా మారవచ్చు.

నెలకు 600 పైగా కేసులు

నెల్లూరులోని ప్రభుత్వ జనరల్‌ ఆస్పత్రి (పెద్దాస్పత్రి)లోని పల్మనాలజీ విభాగానికి ఇటీవల ఊపిరితిత్తులకు సంబంధించిన జబ్బుల కేసులు ఎక్కువగా వస్తున్నాయి. దగ్గు, ఆయాసం, నెమ్ము, ఉబ్బసం తదితర లక్షణాలతో బాధితులు వస్తున్నారు. డాక్టర్ల లెక్కల ప్రకారం రోజూ 20 మందికి పైగా రోగులు పల్మనాలజీ విభాగంలో వైద్యం పొందుతున్నారు. పదిమంది వరకు అడ్మిషన్‌లో ఉంటున్నారు. నెలకు సుమారు 600కు పైగా ఊపిరితిత్తులకు సంబంధించిన కేసులొస్తున్నాయి. 300 మంది వరకు అడ్మిషన్‌లో ఉంటున్నారు.



ఇలా చేస్తే..

ఊపిరితిత్తుల వ్యాధులను ముందస్తుగా గుర్తించి తగిన జాగ్రత్తలు తీసుకుంటే చాలా వరకు నివారించవచ్చు. గుట్కా, పాన్‌పరాగ్‌, ఖైనీ, పొగ తాగడం ఆపాలి. దుమ్ము, ధూళి ప్రాంతాల్లో పనిచేసేవారు మాస్క్‌ ధరించడం ద్వారా లంగ్స్‌కు ఇబ్బంది కలగకుండా చూడొచ్చు. మంచి ఆహారపు అలవాట్లు కలిగి ఉండాలి. అలర్జీ పదార్థాలకు దూరంగా ఉంటే మంచి. 60 సంవత్సరాల వయసు పైబడిన వారు తప్పనిసరిగా ఫ్లూ, నియోనియా వ్యాక్సిన్లు వేయించుకోవడం వల్ల జబ్బుల బారిన పడకుండా ఉండొచ్చు. పౌష్టికాహారం తీసుకోవడంతోపాటు, రోజూ 30 నిమిషాలపాటు వ్యాయామం, ప్రాణాయామం చేస్తే ఉపయోగం ఉంటుంది.

కాలుష్యమూ కారణమే..



గతంలో వందమంది రోగులను పరిశీలిస్తే ఐదారుగురికి ఊపిరితిత్తుల సమస్యలుండేవి. ప్రస్తుతం వంద మంది రోగులను పరిశీలిస్తే 20 కేసులు ఊపిరితిత్తుల సమస్యలవే. దీనికి కాలుష్యం కూడా ఒక కారణం. ఆహారం, నీటి, వాయు కాలుష్యాలతో మనిషి జబ్బు పడుతున్నాడు. అందువల్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలి. కల్తీ లేని ఆహార పదార్థాలు తీసుకోవాలి. జంక్‌ ఫుడ్స్‌ విడనాడాలి. కాయగూరలు, ఆకుకూరలు తీసుకోవాలి. మాస్క్‌ తప్పనిసరిగా ధరించాలి.

– డాక్టర్‌ జి.వెంకటప్రసాద్‌, పల్మనాలజిస్ట్‌, అడిషనల్‌ డీఎంహెచ్‌ఓ

డాక్టర్ల సూచనలు పాటించాలి



గత డిసెంబర్‌ 15 నుంచి ఇన్‌ఫ్లుయంజా వైరస్‌ కారణంగా దగ్గు, ఆయాసం కేసులు ఎక్కువగా వస్తున్నాయి. చాలామందికి లంగ్స్‌లో ఫ్లెమ్‌ ఏర్పడి ఊపిరి తీసుకోవడం కష్టమవుతోంది. బాధితులు కూల్‌డ్రింక్స్‌, చల్లని పదార్థాలు తీసుకోకూడదు. చలిగాలుల నుంచి దూరంగా ఉండాలి. వైద్యుల సూచనలు మేరకు మందులు వాడాలి. మాస్క్‌ ధరిస్తే ఎయిర్‌ ఎలర్జీ నుంచి కాపాడుకోవచ్చు. ఊపిరితిత్తుల్లో చేరిన ఫ్లెమ్‌ కరిగి బయటకు పోవాలంటే కనీసం రెండు వారాల సమయం పడుతుంది.

– డాక్టర్‌ ఎస్‌.విజయభాస్కర్‌రెడ్డి, ఎండీ, పల్మనాలజిస్ట్‌

ఏపీ వైపు పారిశ్రామికవేత్తల చూపు

- గ్లోబల్‌ ఇన్వెస్టర్స్‌ సమ్మిట్‌ సక్సెస్‌
- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

ముత్తుకూరు: 'విశాఖపట్నంలో నిర్వహించిన గ్లోబల్‌ ఇన్వెస్టర్స్‌ సమ్మిట్‌ సక్సెస్‌ అయ్యింది. దేశంలోని ప్రముఖ పారిశ్రామికవేత్తలు ఆంధ్రప్రదేశ్‌లో పరిశ్రమల ఏర్పాటుకు అనువైన వాతావరణం ఉన్నట్టు గుర్తించారు.' అని రాష్ట్ర వ్యవసాయ, సహకార శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. మండలంలోని బ్రహ్మదేవి పంచాయతీలో సోమవారం సాయంత్రం జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా గురవయ్యసాలలో ప్రసంగించారు. గ్లోబల్‌ ఇన్వెస్టర్స్‌ సమ్మిట్‌లో పాల్గొనాలని ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ఒక్క పిలుపు ఇవ్వగానే దేశవిదేశాల్లోని పారిశ్రామికవేత్తలు హాజరయ్యారన్నారు. వైఎస్‌ జగన్‌ నాయకత్వ పటిమకు ఇదొక ఉదాహరణ అన్నారు. ఆయన పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోందన్నారు. దేశ పటంలో ఆంధ్రప్రదేశ్‌ ప్రత్యేక స్థానం సంపాదిస్తుందన్నారు.

అభివృద్ధికి చేశాం

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ నాలుగేళ్ల పాలనలో బ్రహ్మదేవి పంచాయతీలో రూ.13.26 కోట్లతో అనేక అభివృద్ధి పనులు చేశామని మంత్రి కాకాణి అన్నారు. మత్స్యకారేతర ప్యాకేజీ పంపిణీకి రూ.3.75 కోట్లు వ్యయం చేశామని గుర్తుచేశారు. సీసీ రోడ్లు నిర్మించామన్నారు. ఒక్కో కుటుంబానికి రూ.6 లక్షల నుంచి రూ.7 లక్షల మేర లబ్ధి చేకూరిందన్నారు. చంద్రబాబుది మాటల ప్రభుత్వమైతే, వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డిది చేతల ప్రభుత్వమన్నారు. ప్రజలు ఈ తేడాను గుర్తించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్‌ విష్ణువర్ధన్‌రెడ్డి, ఎంపీపీ గండవరం సుగుణ, జెడ్పీటీసీ సభ్యుడు బందెల వెంకటసుబ్బయ్య, మండల ఉపాధ్యక్షుడు పోలిరెడ్డి చిన్నపరెడ్డి, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు నెల్లూరు శివప్రసాద్‌, నాయకులు దువ్వూరు చంద్రశేఖర్‌రెడ్డి, మునుకూరు రవికుమార్‌రెడ్డి, ఈదూరు రామ్మోహన్‌రెడ్డి, కట్టా సుబ్రహ్మణ్యం, నడవడి ముత్యం గౌడ్‌ తదితరులు పాల్గొన్నారు.



మహిళకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

కలెక్టరేట్‌లో పోస్టల్‌ బ్యాలెట్‌ కేంద్రం

- ఓటు హక్కు వినియోగించుకున్న ఉద్యోగులు

నెల్లూరు(అర్బన్‌): ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు నియోజకవర్గాలకు సంబంధించి ఉపాధ్యాయుల, పట్టభద్రుల ఎమ్మెల్సీల ఎన్నికలకు సంబంధించి పోలింగ్‌ విధులకు హాజరవుతున్న ఉద్యోగులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. సోమవారం నెల్లూరులోని కలెక్టరేట్లో ఉన్న తిక్కన ప్రాంగణంలో సూక్ష్మ పరిశీలకులకు శిక్షణ ఇచ్చారు. దీనికి హాజరైన ఎన్నికల సిబ్బంది కోసం పోస్టల్‌ బ్యాలెట్‌ కేంద్రాన్ని కలెక్టరేట్‌ ఆవరణలో ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఉద్యోగులు ఓటు వేశారు. ఈ ప్రక్రియను కలెక్టర్‌ చక్రధర్‌బాబు, ఎస్పీ విజయారావు, జేసీ కూర్మనాథ్‌, నోడల్‌ అధికారులు వెంకట్రావు, శ్రీనివాసులు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ మాట్లాడుతూ ఈనెల 9వ తేదీన నెల్లూరులోని వీఆర్‌ పీజీ కళాశాలలో మరోసారి ఎన్నికల శిక్షణ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. దీనికి వచ్చే సిబ్బంది కోసం అక్కడ నాలుగు ప్రత్యేక పోస్టల్‌ బ్యాలెట్‌ కేంద్రాలను ఏర్పాటు చేస్తామన్నారు. శిక్షణకు హాజరయ్యే ఉద్యోగులందరూ పోస్టల్‌ బ్యాలెట్‌ను వినియోగించుకుని ఓటెయ్యాలని కోరారు.



పోస్టల్‌ బ్యాలెట్‌లో ఓటు వేస్తున్న ఉద్యోగి



రిజిస్టర్‌లో సంతకం చేస్తున్న ఉద్యోగులు

ప్రభుత్వంపై నమ్మకంతోనే పరిశ్రమల రాక

- వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ క్లీన్‌స్వీప్‌ ఖాయం
- వేమిరెడ్డి, ఆదాల, బీద, ప్రసన్న
- బుచ్చిరెడ్డిపాళెంలో వైఎస్సార్‌సీపీ కార్యాలయం ప్రారంభం

బుచ్చిరెడ్డిపాళెం: ప్రభుత్వం, సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డిపై నమ్మకంతోనే రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటుకు పారిశ్రామికవేత్తలు మొగ్గు చూపుతున్నారని రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు అన్నారు. బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీలో రూ.25 లక్షలతో నిర్మించిన వైఎస్సార్‌సీపీ కార్యాలయాన్ని సోమవారం కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డితో కలిసి వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వేమిరెడ్డి మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని అన్ని అసెంబ్లీ, ఎంపీ స్థానాల్లో వైఎస్సార్‌సీపీ విజయం సాధించి క్లీన్‌స్వీప్‌ చేయడం ఖాయమన్నారు. పట్టభద్రుల, టీచర్ల ఎమ్మెల్సీ ఎన్నికల్లో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని కోరారు. వీటిని సాధారణ ఎన్నికలుగా భావించి నాయకులు, కార్యకర్తలు పని చేయాలని సూచించారు. వచ్చే ఎన్నికల్లో కోవూరు ఎమ్మెల్యేగా నల్లపరెడ్డి భారీ మెజార్టీ సాధించడం ఖాయమన్నారు.

ప్రతిపక్షాలకు చెంపపెట్టు

రాష్ట్రంలో అభివృద్ధి జరగలేదని చెబుతున్న ప్రతిపక్షాలకు ఇటీవల విశాఖపట్నంలో జరిగిన గ్లోబల్‌ ఇన్వెస్టర్స్‌ సమ్మిట్‌ చెంపపెట్టు లాంటిదని ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. రాష్ట్రంలో సంక్షేమంతోపాటు అభివృద్ధి కూడా వేగవంతంగా జరుగుతోందన్నారు. రామాయపట్నం పోర్టు పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. జిల్లాలో పెద్దఎత్తున అభివృద్ధి పనులు చేస్తున్నట్లు చెప్పారు.

యువతకు ఉద్యోగావకాశాలు

పెట్టుబడుల వెల్లువతో రాష్ట్రంలో యువతకు ఉద్యోగావకాశాలు అధికంగా రాబోతున్నాయని రాజ్యసభ సభ్యుడు మస్తాన్‌రావు అన్నారు. విశాఖపట్నంలో జరిగిన గ్లోబల్‌ ఇన్వెస్టర్స్‌ సమ్మిట్‌ ద్వారా లక్షల కోట్ల రూపాయల విలువైన పెట్టుబడులు రానున్నట్లు చెప్పారు. ఇది రాష్ట్ర ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమన్నారు. పెద్ద పారిశ్రామికవేత్తలు పరిశ్రమలు స్థాపించేందుకు ముందుకు వచ్చారని తెలిపారు. వైఎస్సార్‌సీపీలో అన్ని సామాజికవర్గాలకు సమన్యాయం జరుగుతోందన్నారు. ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి లాంటి వ్యక్తి కోవూరు ప్రజలకు దొరకడం వారి అదృష్టమన్నారు. కార్యక్రమంలో ఆప్కాఫ్‌ చైర్మన్‌ కొండూరు అనిల్‌బాబు, డీసీఎంఎస్‌ చైర్మన్‌ వీరి చలపతిరావు, డీఏఏబీ చైర్మన్‌ దొడ్డంరెడ్డి నిరంజన్‌బాబురెడ్డి, విజయ డెయిరీ చైర్మన్‌ కొండ్రెడ్డి రంగారెడ్డి, నగర పంచాయతీ చైర్‌పర్సన్‌ మోర్ల సుప్రజ, నాయకులు యర్రంరెడ్డి గోవర్ధన్‌రెడ్డి, పుట్టా సుబ్రహ్మణ్యం నాయుడు, మోర్ల మురళి, మేనకూరు సీతారామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వైఎస్సార్‌సీపీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎంపీలు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఆదాల ప్రభాకర్‌రెడ్డి, బీద మస్తాన్‌రావు, ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

రేపు ఫెన్సింగ్‌ జట్ల ఎంపికలు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): ఫెన్సింగ్‌ జిల్లా జట్ల (జూనియర్‌ విభాగంలో)ఎంపికలను బుధవారం సాయంత్రం నాలుగు గంటలకు నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్‌ కాంప్లెక్స్‌లో నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి నెల్లూరు జిల్లా ఫెన్సింగ్‌ అసోసియేషన్‌ అధ్యక్ష, కార్యదర్శులు పాటూరు వేణుగోపాలరెడ్డి, జి.గురవయ్య సోమవారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. క్రీడాకారులు ఫెన్సింగ్‌ అసోసియేషన్‌ ఆఫ్‌ ఇండియా వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్‌ చేయించుకోవాలన్నారు. సొంత క్రీడా పరికరాలతో హాజరుకావాలన్నారు. ఇతర వివరాలకు 91604 34771 , 98660 46881 ఫోన్‌ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

సోమశిలలో 59.662 టీఎంసీలు

సోమశిల: సోమశిల జలాశయంలో సోమవారానికి 59.662 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పెన్నార్‌ డెల్టాకు 2,100 క్యూసెక్కులు, ఉత్తరకాలువకు 623, దక్షిణకాలువకు 400, కండలేరుకు 50 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం 97.943 మీటర్ల నీటి మట్టం నమోదైంది.

ఏప్రిల్ నుంచి సమస్యలపై పోరాటం


మాట్లాడుతున్న సూర్యనారాయణ

- ఏపీ జీఈఏ రాష్ట్ర అధ్యక్షుడు సూర్యనారాయణ

నెల్లూరు (అర్బన్) : ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్ల సమస్యల పరిష్కారానికై ఏప్రిల్ నుంచి పోరాటం చేస్తామని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఏపీ జీఈఏ రాష్ట్ర అధ్యక్షుడు కేఆర్ సూర్యనారాయణ తెలిపారు. నెల్లూరు వచ్చిన ఆయన స్థానిక సుందరరామిరెడ్డి కల్యాణ మండపంలో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఉద్యోగుల ఆర్జిత సెలవులు, డీఏలు ఇలా పలు రకాల బకాయిలను ప్రభుత్వం సంవత్సరాల తరబడి చెల్లించలేదన్నారు. దీనిపై ఈనెలలో ప్రవేశ పెట్టే బడ్జెట్‌లో నిధులు కేటాయించాలన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు లక్ష్మీపతి, పీఆర్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాగేంద్ర కుమార్, రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసులురెడ్డి, మహిళా విభాగం రాష్ట్ర కో–చైర్మన్ సులోచన తదితరులు పాల్గొన్నారు.

చితికిన ప్రాణాలు

రోడ్డు ప్రమాదం మూడు కుటుంబాల్లో తీరని విషాదం నింపింది. జిల్లాలో జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు దుర్మరణం చెందారు. నెల్లూరు నగరంలో మితిమీరిన వేగంతో వచ్చిన బస్సు ఓ మహిళ ప్రాణాన్ని బలిగొనగా, బుజబుజనెల్లూరులో బైక్ అదుపుతప్పి ఓ వ్యక్తి, మనుబోలులో బస్సు ఢీకొని మరో వ్యక్తి దుర్మరణం చెందారు.

- వేర్వేరు ఘటనల్లో ముగ్గురి దుర్మరణం


మృతదేహాన్ని పరిశీలిస్తున్న నాగేశ్వరమ్మ

బస్సు చక్రాల కింద..

నెల్లూరు(క్రైమ్) : ప్రైవేటు బస్సు మితిమీరిన వేగంతో రోడ్డుదాటుతున్న మహిళను ఢీకొంది. బస్సు చక్రాలు మహిళపైకి ఎక్కడంతో తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందింది. ఈ ఘటన కనకమహల్ సెంటర్‌లో సోమవారం చోటుచేసుకుంది. ట్రాఫిక్ పోలీసుల సమాచారం మేరకు.. కోవూరు మండలం ఇనుమడుగుకు చెందిన వి.పెంచలయ్య, మాధవి(40) దంపతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. నెల్లూరు ఏసీసెంటర్‌లోని ఓ హోటల్‌లో మాధవి పనిచేస్తోంది. ఎప్పటిలాగే ఆమె పనికి వెళ్లేందుకు ఇంటి నుంచి బయలుదేరింది. కనకమహల్ సెంటర్ వద్ద ఆటో దిగి రోడ్డు దాటుతుండగా యల్లాయపాళెం నుంచి ఆర్టీసీ బస్టాండ్‌కు వెళ్తున్న ప్రైవేటు సిటీ బస్సు ఆమెను వేగంగా ఢీకొంది. దీంతో ఆమె రోడ్డుపై పడగా ఆమె తలపైకి బస్సు ముందు చక్రం ఎక్కడంతో అక్కడికక్కడే మృతిచెందింది. డ్రైవర్ నడిరోడ్డుపైనే బస్సును వదిలి పరారయ్యాడు. దీనిపై సమాచారం అందుకున్న నార్త్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మిద్దె నాగేశ్వరమ్మ, ఎస్సై జి.గీతారమ్య సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. బాధిత కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. ప్రమాదానికి కారణమైన బస్సును స్వాధీనం చేసుకున్నారు. ప్రభుత్వ వైద్యులు మృతదేహానికి శవపరీక్ష నిర్వహించి కుటుంబసభ్యులకు అందజేశారు. మృతురాలి కుమారుడు వెంకటేష్ ఫిర్యాదు మేరకు ఎస్సై కేసు దర్యాప్తు చేస్తున్నారు. మితిమీరిన వేగమే ప్రమాదానికి కారణమని పోలీసు అధికారులు తెలిపారు.

బైక్ అదుపుతప్పి..

నెల్లూరు(క్రైమ్) : బైక్ అదుపుతప్పడంతో ఓ యువకుడు రోడ్డుపై పడి మృతిచెందిన ఘటనపై సౌత్ ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. హైదరాబాద్‌లోని అంబర్‌పేటకు చెందిన జి.వాసు(29), శ్వేత దంపతులు. ఆయన ఓ ప్రైవేటు కంపెనీలో ఫైనాన్సింగ్ విభాగంలో పనిచేస్తున్నారు. శ్వేత గర్భిణి కావడంతో కొంతకాలం కిందట బుజబుజనెల్లూరులోని ఆమె తల్లిదండ్రుల ఇంటికి వచ్చారు. ఆమె ఇక్కడే బాబుకు జన్మనిచ్చారు. ఈక్రమంలో భార్య, కుమారుడిని హైదరాబాద్‌కు తీసుకెళ్లేందుకు భర్త ఇటీవల నెల్లూరుకు వచ్చారు. ఆదివారం అర్ధరాత్రి నగరంలో నుంచి బైక్‌పై ఇంటికి బయలుదేరారు. బుజబుజనెల్లూరు సర్వీసు రోడ్డుపై వెళ్తుండగా బైక్ అదుపుతప్పడంతో కిందపడ్డారు. తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. ప్రమాదంపై సమాచారం అందుకున్న సౌత్ ట్రాఫిక్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుని వద్ద లభ్యమైన ఆధారాల మూలంగా బాధిత కుటుంబసభ్యులను గుర్తించి వారికి సమాచారం అందించారు. అనంతరం మృతదేహాన్ని శవపరీక్షల నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించారు. వైద్యులు మృతదేహానికి సోమవారం శవపరీక్ష నిర్వహించి బాధితులకు అప్పగించారు. సౌత్ ట్రాఫిక్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బస్సు ఢీకొని..


పెంచలయ్య మృతదేహం

మనుబోలు : మోటార్ బైక్‌పై రోడ్డు దాటుతుండగా వేగంగా వచ్చిన బస్సు ఢీకొనడంతో ఓ యువకుడు అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని కాగితాలపూరు క్రాస్‌రోడ్డు వద్ద సోమవారం వేకువజామున జరిగింది. పోలీసుల కథనం మేరకు వివరాలు.. మండలంలోని పిడూరు గ్రామానికి చెందిన పెసల పెంచలయ్య(26) అవివాహితుడు. తల్లిదండ్రులు లేకపోవడంతో ఒంటరిగానే ఉంటూ వరికోత యంత్రం డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. గూడూరు దగ్గర విందూరులో పనిచేసేందుకు సోమవారం మోటార్ బైక్‌పై బయలుదేరాడు. కాగితాలపూరు క్రాస్‌రోడ్డు వద్ద రోడ్డు దాటుతుండగా గుంటూరు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు నెల్లూరు వైపు నుంచి గూడూరు వైపు వేగంగా వస్తూ బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో పెంచలయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గూడూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వల్లూరు చెరువులో వ్యక్తి గల్లంతు


రోదిస్తున్న జగదీష్ తల్లిదండ్రులు

ముత్తుకూరు : మండలంలోని వల్లూరు చెరువులో సోమవారం సాయంత్రం ఓ వ్యక్తి గల్లంతయ్యాడు. స్థానికుల కథనం మేరకు.. స్థానిక శివాలయంలో జరిగే ఉత్సవాలకు నెల్లూరు ఎన్టీఆర్‌నగర్ నుంచి ఓ కుటుంబం ఖర్జూరం అమ్మేందుకు వచ్చింది. ఈ కుటుంబానికి చెందిన కన్నపు జగదీష్ (27) ఆలయ సమీపంలోని చెరువులో దిగాడు. లోతు ఉండడంతో నీటిలో మునిగిపోయాడు. సమాచారం తెలిసిన వెంటనే తహసీల్దార్ మనోహరబాబు, పోలీసులు చెరువు వద్దకు చేరుకున్నారు. చీకటి పడడంతో చెరువులో దిగేందుకు ఎవరూ సాహసించలేదు. మంగళవారం ఉదయం గాలింపు చేపడుతామని పోలీసులు తెలిపారు.

అబ్బురపరిచిన స్కేటింగ్


మర్రిపాడు మండలంలో స్కేటింగ్ చేస్తున్న విద్యార్థి వేద నరసింహ

మర్రిపాడు : మండలంలోని జాతీయ రహదారి గుండా చిన్నారి నిర్వహించిన స్కేటింగ్ చూపురులను ఆకట్టుకుంది. తిరుపతికి చెందిన కోటంబేడు వేద నరహింహ అనే తొమ్మిదేళ్ల చిన్నారి తిరుపతి జిల్లా ఏర్పేడులో సోమవారం ప్రారంభించిన స్కేటింగ్ మర్రిపాడు మండలంలోని నెల్లూరు – ముంబై జాతీయ రహదారిపై సాగింది. వేద నరసింహ అనే విద్యార్థి స్కేటింగ్‌లో పలు రికార్డు కోసం ఏర్పేడులో ఉదయం 6.30 గంటలకు స్కేటింగ్ ప్రారంభించారు. వెంకటగిరి, రాపూరు, పెంచలకోన, మర్రిపాడు మీదుగా బుచ్చిరెడ్డిపాళెం మీదుగా సాగింది. ఇందుకోసం జాతీయ రహదారి వెంబడి ట్రాఫిక్ అంతరాయం కలగకుండా మర్రిపాడు ఎస్సై విశ్వనాథరెడ్డి, ఏఎస్సై శ్రీనివాసులరెడ్డి ప్రత్యేక బందోబస్తును ఏర్పాటు చేశారు. ఎక్కడికక్కడ సిబ్బందిని నియమించి ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చూశారు. చిన్నారి నరసింహ స్కేటింగ్ చేస్తున్నాడనే సమాచారంతో జాతీయ రహదారి వెంట అన్ని గ్రామాల్లో గ్రామస్తులు, విద్యార్థులు విద్యార్థిని ప్రత్యేకంగా అభినందించారు.

కేరింత నడుమ

సంగం : ప్రపంచ రికార్డు సాధన కోసం వెళ్తున్న చిన్నారి కోటంబేడు వేద నరసింహ సంగం మండలం మీదుగా వెళ్తుండటంతో ఎస్సై నాగార్జునరెడ్డి అతనికి పూర్తి సహకారం అందించారు. ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా సిబ్బందిని నియమించి చిన్నారిని సంగం మండలం దాటించారు. నెల్లూరు – ముంబై జాతీయ రహదారి వెంట అన్ని గ్రామాల్లో విద్యార్థిని విద్యార్థులు కేరింతలు కొడతూ వేద నరసింహను ఉత్సాహపరిచారు.

జోనల్ ఇన్‌చార్జుల నియామకం

నెల్లూరు(సెంట్రల్): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ అనుబంధ విభాగ జోనల్ ఇన్‌చార్జులను నియమించినట్లు ఆ పార్టీ కేంద్ర కార్యాలయం సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది. మూడు జిల్లాలకు సంబంధించి ఒక జోనల్ ఇన్‌చార్జిని నియమించింది. నెల్లూరు, వైఎస్సార్ కడప, తిరుపతి జిల్లాల యువజన విభాగానికి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి (చంద్రగిరి), రైతు విభాగానికి మావులూరి శ్రీనివాసులురెడ్డి (కోవూరు), బీసీ సెల్ విభాగానికి తొండమల్ల పుల్లయ్య (తిరుపతి), వైఎస్సార్‌టీయూసీ విభాగానికి నారపరెడ్డి రాజారెడ్డి (తిరుపతి), పంచాయతీరాజ్ విభాగానికి చీర్ల సురేష్‌యాదవ్ (కమలాపురం), ఎస్టీ సెల్ విభాగానికి చేవూరు పద్మ (కావలి), మైనార్టీ సెల్ విభాగానికి సయ్యద్ హంజాహుస్సేన్ (నెల్లూరు సిటీ), విద్యార్థి విభాగానికి లెక్కల రాజశేఖర్‌రెడ్డి (తిరుపతి), వికలాంగుల విభాగానికి కామిరెడ్డి శివారెడ్డి (వినుకొండ), వైఎస్సార్ సేవాదల్ విభాగానికి షేక్ మహమ్మద్ రఫీ (తిరుపతి), డాక్టర్స్ విభాగానికి అమీర్ బాషా (కడప), వాణిజ్య విభాగానికి చందోలు సతీష్ (నెల్లూరు సిటి), కల్చరల్ విభాగానికి ఎస్.కృష్ణవేణి (తిరుపతి), పబ్లిసిటీ విభాగానికి డి.బీరేంద్ర వర్మ (సత్యవేడు), మహిళా విభాగానికి రత్న కుమారి (కడప), గ్రీవెన్స్ సెల్ విభాగానికి పోకల రామకృష్ణారెడ్డి (బద్వేల్), వీవర్స్ విభాగానికి మిద్దెల హరి (తిరుపతి) లను పార్టీ కేంద్ర కార్యాలయం నియమించింది.

పోస్ట్‌మాస్టర్‌పై కేసు నమోదు

గుడ్లూరు : పోస్టాఫీసులో దాచుకున్న ప్రజల సొమ్మును దుర్వినియోగం చేసిన రావూరు బ్రాంచ్ పోస్ట్‌మాస్టర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రసాదరెడ్డి సోమవారం తెలిపారు. వివరాలు.. మండలంలోని రావూరు గ్రామంలో బ్రాంచ్ పోస్ట్‌మాస్టర్‌గా పనిచేస్తున్న లక్ష్మీప్రసన్నకుమారి గ్రామస్తులు సేవింగ్, ఆర్‌డీల ద్వారా దాచిపెట్టుకున్న రూ.2.4 లక్షల నగదును రామాయపట్నం హెడ్ పోస్టాఫీసులో జమ చేయకుండా ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడు మండలంలోని కల్లగుంట గ్రామానికి చెందిన తన స్నేహితుడు ముత్తయ్య అనే యువకుడికి విడతల వారీగా ఇచ్చింది. ఆ నగదును అతను ఇవ్వకపోవడంతో లక్ష్మీ ప్రసన్నకుమారి నగదును జమ చేయలేదు. విషయం తెలుసుకున్న రామాయపట్నం పోస్ట్‌మాస్టర్ కందుకూరు హెడ్ పోస్టాఫీసుకు ఫిర్యాదు చేయడంతో విషయం వెలుగులోకి వచ్చింది. దీంతో లక్ష్మీప్రసన్నకుమారి, ముత్తయ్య అనంతపురానికి పారిపోయారు. నాలుగు రోజుల క్రితం కందుకూరు సూపరింటెండెంట్ శివాజీ గుడ్లూరు పోలీస్‌స్టేషన్‌లో ఆమెపై ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన ఎస్సై ప్రసాద్‌రెడ్డి వారిని అదుపులోకి తీసుకొని గుడ్లూరు పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చారు. విచారణ అనంతరం వారిని కోర్టులో హాజరు పరుస్తామని ఎస్సై తెలిపారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్):	రూ.100
లేయర్ (లైవ్)	రూ.75
బ్రాయిలర్ చికెన్:	రూ.180
స్కిన్‌లెస్ చికెన్:	రూ.200
లేయర్ చికెన్:	రూ.128



నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి	: రూ.80
సన్నవి	: రూ.74
పండ్లు	: రూ.40

